
# రాంబాబు డైరీ

నండూరి పార్థసారథి



పేరు : రాంబాబు
వయుస్సు : ఇరవై సంవత్సరాలు.
ఎత్తు : 5 అ. 7 అంగుళాలు.
బరువు : 59 కిలోలు
ఛాతీ : 34 అంగుళాలు.
రంగు : ఏవరేజ్

అభిమాన విషయువులు :

జర్నలిజము, సాహిత్యము, సంగీతము, సైకో ఎనాలిసిస్సు, వేదాంతము, వైరాగ్యము, దేశభక్తి, దైవభక్తి, పాలిటిక్సు, చారిత్రక పరిశోధన, లాజిక్కు, మేజిక్కు, సౌందర్యారాధన మొదలగునవి.

జూన్ 4 :

సంగీతం, ఫిలాసఫీ, సైకో ఎనాలసిస్ అంటూ ఇంతకాలం క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేశాను. ఈ రోజుల్లో క్రికెట్ పరిజ్ఞానం లేనివాణ్ణి ఆది మానవుణ్ణి చూసినట్లు చూస్తారు. బొడ్డూడని కుర్రకుంకలు సైతం రోడ్లమీద క్రికెట్ ఆడుతూ బౌండరీలు, సిక్సర్లు కొడుతుంటే నాకు వాళ్లపాటి పరిజ్ఞానం లేకపోవడం షేమ్.

ఇవాళ పక్కింటి కోతి తమ్ముడు లడ్డూగాడు, ఇంటాయన కొడుకు శీను మరికొందరు పిల్లలతో కలిసి వీథిలో క్రికెట్ ఆడుతుంటే ఇన్స్పిరేషన్ వచ్చి నేను కూడా కాసేపు ప్రయోగాత్మకంగా బౌలింగు, బాటింగు, ఫీల్డింగు మున్నగునవి చేశాను. లడ్డూగాడి ఫాస్ట్ బౌలింగ్ దెబ్బకి నా మోకాలిచిప్ప ఎగిరిపోయింది. నేను బాట్ పడేసి కుంటుకుంటూ రనౌట్ చేశాను. బాల్కనీలోంచి చూసిన కోతి 'అహ్హహ్హ' అంటూ నవ్వింది. హేళనగా నవ్వినప్పటికీ కోతి అందాన్ని ఎడ్మయిర్ చెయ్యకుండా ఉండలేకపోయాను. కానీ, అంతలోనే వర్లక్ష్మి జ్ఞాపకం వచ్చి తీవ్ర పశ్చాత్తాపంతో మనస్సులోనే లెంపలేసుకున్నాను. మనస్సు బహుచంచలము కదా!

ఇండియా ఆస్ట్రేలియా క్రికెట్ మాచ్‌తో పాటు వర్లక్ష్మిని కూడా చూసినట్లవుతుంది కదా అని సాయంత్రం మావయ్య గారింటికి వెళ్లాను. నేను వెళ్లేటప్పటికి మావయ్య, అత్తయ్య, వర్లక్ష్మి, ఆమె ఫ్రెండ్సు, వెంకటేశంగాడు సముద్వేగంతో టీవీ తిలకిస్తున్నారు. మధ్యమధ్య ప్రశంసాపూర్వకంగా తప్పట్లు కొడుతూ, బిగ్గరగా అరుస్తున్నారు. వాళ్లు ఎవరిని ఎడ్మయిర్ చేస్తున్నారో, ఎందుకు అరుస్తున్నారో నాకు అర్థం కాలేదు. మరీ మొద్దులా కూర్చుంటే బాగుండదని అందరూ తప్పట్లు కొడుతున్నప్పుడు ఎందుకైనా మంచిదని నేను కూడా ఒకసారి 'గోల్' అని అరిచాను. వాళ్లంతా టీవీ చూడటం మానేసి నావంక చూసి నవ్వడం మొదలుపెట్టారు. వాళ్ల ఎందుకు నవ్వారో నాకు అర్థమై చావలేదు. ఇదివరకు ఒకసారి ఇలాగే టీవీలో ఏదో ఆట చూస్తూ వర్లక్ష్మి 'గోల్' అని అరిచింది కదా అని ఇవాళ నేనూ అరిచాను. 'క్రికెట్‌లో గోల్ ఏమిట్రా నీ తలకాయ!' అన్నాడు మావయ్య. తరువాత మళ్లీ అందరూ టీవీ చూస్తూ రకరకాల వ్యాఖ్యలు విశ్లేషణలు చేయుడం మొదలుపెట్టారు.

'తెండుల్కర్ జీరో, ద్రావిడ్ రెండు, అజారుద్దీన్ మూడు. షేమ్! వీళ్లకంటే ఒక్కోసారి ఎక్స్ట్రాలే బాగా ఆడతారు మావయ్యా! ఇవాళ ఎక్స్ట్రాలు పది రన్‌లు చేశారు!'' అన్నాను. మళ్లీ అందరూ గొల్లుమని నవ్వారు. నవ్వి నవ్వి వర్లక్ష్మికి కళ్లనీళ్ల పర్యంతం అయింది. బ్రహ్మానందం,
బాబూమోహన్‌ల
హాస్యానికి కూడా వర్లక్ష్మి
అంతచేటు ఎప్పుడూ
నవ్వలేదు. అసంకల్పితంగా
నేనేదో పెద్ద జోకే
వేసినట్లున్నాను.

మావయ్య వాళ్లింట్లో
భోజనం చేసి రూముకి
తిరిగొచ్చాక ఎక్స్ట్రాలని
గురించి తీవ్రంగా
ఆలోచించాను. టీవీలో
క్రికెట్ చాలాసార్లే చూశాను
గానీ, ఎక్స్ట్రాలెవరో,
ఎంతమంది ఉంటారో
తెలుసుకోలకపోయాను.
సినిమాల్లో ఎక్స్ట్రాలలాగా
వీళ్లు కూడా అనామకులు
కాబోలు. అనేక
సందర్భాలలో టీము
విజయానికి ఇతోధికంగా
దోహదం చేస్తున్న ఈ
క్రికెట్ వీరులను
చిన్నచూపు చూడడం మిక్కిలి శోచనీయం. 'సుజనమిత్ర'లో నా జాబ్‌లాగానే వాళ్లదీ బొత్తిగా థాంక్‌లెస్ జాబ్ అయిపోయింది. ఈ యాభై రన్స్ చేసినా ఒక్కళ్లూ వాళ్లని కొనియాడరు. అసలు ఈ అజ్ఞాత వీరులెవరా అని సారథినో, భాస్కర్రావునో, పోనీ వర్లక్ష్మినో అడుగుదామనుకుంటే వాళ్లు 'ఇంతమాత్రం తెలీదా' అని నవ్వుతారేమోనని భయం. ఎప్పటికైనా నేనే పరిశోధించాలి స్వయంగా.

ఇదివరకు రెండు మూడు సార్లు మావయ్యా వాళ్లింట్లో క్రికెట్ చూసినప్పుడు వర్లక్ష్మి తెండుల్కర్‌ని ప్రేమిస్తోందని అనుమానించాను. నా అనుమానం నిరాధారమని ఇవాళ తెలుసుకున్నాను. తెండుల్కర్ ఇవాళ ఒక్క రన్ కూడా చేయకుండా అవుట్ అయ్యేటప్పటికి వర్లక్ష్మి అందరికంటే గట్టిగా 'షేమ్' అని అరుస్తూ తీవ్రంగా దుయ్యబట్టింది. జడేజా బౌండరీలు, సిక్సర్లు కొట్టినప్పుడల్లా సూపర్బ్, వండ్రఫుల్ అంటూ ప్రశంసల వర్షం కురిపించింది. సంతోషంతో ఆమె మొహం మతాబు వలె వెలిగిపోయింది. ఆమె జడేజాను ప్రేమిస్తున్నట్లు నిర్ద్వంద్వంగా తేలిపోయింది. నా మనస్సంతా కకావికలమైపోయింది. తలుచుకున్న కొద్దీ దుఃఖం ముంచుకొస్తున్నది.

బడీచౌడీ హనుమంతుల వారికి కొబ్బరకాయు కొట్టవలెను.

జూన్ 9 :

వరల్డ్ కప్ క్రికెట్‌లో నిన్న పాకిస్తాన్‌పై భారత జట్టు ఘనవిజయం సాధించింది. ఈ ఆటలో కూడా ఎక్స్ట్రాలు పద్నాలుగు రన్‌లు చేసే మన జట్టు విజయానికి ఇతోధికంగా దోహదం చేశారు.

కార్గిల్‌లో భారత, పాకిస్తాన్ల మధ్య భీకర

పోరాటం సాగుతున్నది. మన జవాన్లు ఇప్పటిదాకా 221 మంది పాక్ సైనికులను వీరోచితంగా ఊచకోత కోసినట్లు సైనిక వర్గాలద్వారా తెలుస్తున్నది. నా నరనరాల్లో ఉడుకురక్తం ఉరకలు వేస్తోంది. అవసరమైతే అమరవీరుల సహాయార్థం రక్తదానానికైనా వెనుకాడరాదని ప్రతిజ్ఞ చేశాను.

ఆంధ్రప్రదేశ్ అవతరించి నలభయ్యేళ్లు దాటినా ఇప్పటికీ హైదరాబాదులో చాలాచోట్ల హిందీ, ఉర్దూ ఎక్కువగా వినిపిస్తుండడం సిగ్గుచేటు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు. హిందీ రానివాళ్లంటే ఆటోవాళ్లకి కూడా అలుసే. సాయంత్రం ఒక ఆటోవాణ్ణి బడీచౌడీకి వస్తావా అంటే, మీటరు వెయ్యకుండా 'పంద్రా రూపయా!' అన్నాడు. నేను ఎనిమిది రూపాయలిస్తానన్నాను. అతడు 'నై సాబ్' అన్నాడు. నేను తెలుగుతో శక్తివంచన లేకుండా చాలాసేపు బేరమాడాను. అతడు మాత్రం హిందీలోనే జవాబిస్తున్నాడు. నాకు ఒళ్లుమండిపోయింది. "ఆఖ్రీ బాత్. దస్ రూపయా దేవూంగా. ఆతే ఆ, జాతే జా!" అన్నాను. అతడు 'నై సాబ్' అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

హిందీలో మాట్లాడటం ప్రాక్టీసు చేసి బి.ఏ. కాగానే జాతీయస్థాయి రాజకీయాలలో చేరిపోవాలి. ఆటోవాళ్లతో పోట్లాడటం కష్టమే గానీ, హిందీలో రాజకీయ ఉపన్యాసాలివ్వడం అట్టే కష్టం కాదు. సంస్కృత పదాలు ఎక్కువగా ఉపయోగిస్తే తేలిగ్గా ఉత్తర భారతీయుల ప్రశంసలకు గురి కావచ్చును. వారు మనల్ని పండిత్‌జీ అంటూ గౌరవిస్తారు.

మే యహాఁ ఏక్ ఉదాహరణ్ దే రహాఁ హుఁ.

"సోదరీ సోదరీమణియోం .... ఆజ్ హమారా సర్‌హద్ పర్ పాకిస్తాన్ విద్రోహియాఁ బడీ అన్యాయ్ సే దురాక్రమణ్ కర్ రహా హైఁ. ఏ పరిస్థితి బహూత్ దురదృష్టకర్ హైఁ. లేకిన్, దేశ్ కే గౌరవ్ ఔర్ ప్రతిష్ఠా పరిరక్షణ్ కెలియే హమారా జవానోం ధైర్య్ ఔర్ సాహస్ సే వీరోచిత్ సంగ్రామ్ కర్‌రహా హైఁ. ఏ బాత్ బహూత్ సంతోష్‌కర్ హైఁ. ఆజ్ హమ్ సబ్ ఏక్ అతి ముఖ్య నిర్ణయ్ లేనేకేలియే యహాఁ సమావేశ్ కర్ రహా హైఁ..."

ఆసేతు హిమాచలం ప్రతి ఒక్కరూ ఈ భాషను తేలిగ్గా అర్థం చేసుకోగలరనుకోవడంలో సందేహం లేదు.

**జూన్ 14 :**

అటు చూస్తే కార్గిల్, ఇటు చూస్తే వర్లక్ష్మి. ఎటు పోవాలో తేల్చుకోలేక మనస్సు ఒకటే ఇతమిత్థమైపోతున్నది. నా మనోవేదనను హృదయం విప్పి సారథికి చెప్పుకున్నాను. మా ఇద్దరి సంభాషణ పూర్తి పాఠాన్ని సంగ్రహంగా ఈ కింద పొందుపరుస్తున్నాను.

"స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ, నెహ్రూజీ మున్నగు ఎందరో మహనీయులు కాలేజీ చదువులకు స్వస్తి చెప్పి, ఖద్దరు ధరించి, ప్రాణాలకు తెగించి, బ్రిటిషువారి నెదిరించి పోరాడారు. కారాగార క్లేశం అనుభవించారు. ఆ దేశభక్తుల త్యాగాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యానికి మళ్లీ ఇప్పుడు పాక్ దురాక్రమణ వల్ల ముప్పు వాటిల్లింది."

"ఈ ఊకదంపుడు చాల్లేవోయ్! అసలు సంగతి చెప్పు."



"కార్గిల్‌లో ఒకవైపు భీషణ సంగ్రామం జరుగుతున్నా మనం ఇంకా కాలేజీ చదువును త్యాగం చెయ్యలేకపోతున్నామంటే గిల్టీగా అనిపిస్తోందోయ్. చదువుకు స్వస్తి చెప్పి సైన్యంలో చేరిపోవాలనిపిస్తోంది."

"మరింకా ఆలస్యం దేనికి? శుభస్య శీఘ్రం! నీ దేశభక్తికి నా జోహార్లు!"

"అది కాదోయ్, వర్లక్ష్మిని తలచుకుంటే చాలా బాధగా ఉంది."

"దానికీ, దీనికీ సంబంధమేమిటోయ్?"

"సైన్యంలో చేరాలంటే వర్లక్ష్మి ప్రేమను త్యాగం చేయక తప్పదు కదా! కార్గిల్ పోరులో నేను వీరమరణం పొందితే, నా భౌతికకాయాన్ని విమానంలో హైదరాబాదుకు తీసుకువచ్చి సకల సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తున్నప్పుడు ఆమె కన్నీ మున్నీరుగా ఎంత విలపిస్తుందో కదా! అభం శుభం ఎఱుగని కన్నెపిల్ల. కాళ్ల పారాణి తడియారకుండానే భర్తృవిహీన అవుతుందంటే ...."



ఆపై ఇంక నోట మాట రాలేదు. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. కళ్లవెంట నీళ్లు జలజలా రాలాయి. సారథి హృదయం రవ్వంతైనా కరగలేదు. రాయిలా ఉన్నాడు.

"పెళ్లే కాకుండా భర్తృవిహీన ఎలా అవుతుందోయ్, నీ తలకాయ్!" అన్నాడు.

"పెళ్లి కాకపోయినా ఆమె నా అర్ధాంగేనోయ్!" అన్నాను.

"నిన్ను చేసుకుంటానని ఎప్పుడైనా చెప్పిందా?"

"ఏ ఆడపిల్లయినా సిగ్గు విడచి అలా చెబుతుందిటోయ్?"

"పోని ప్రేమించానని చెప్పిందా?"

"లేదోయ్."

"నువ్వైనా చెప్పావా తనని ప్రేమిస్తున్నట్లు?"

"నోరు విప్పి ఒక్క మాటైనా చెప్పకుండా తను నిన్ను ప్రేమిస్తోందని ఎలా అనుకుంటావు?"

"మౌనం అర్ధాంగీకారం అంటారు కదుటోయ్!"

"అంటే నీ ఉద్దేశం?"

"అర్ధాంగీకారం అంటే అర్ధాంగి కావటానికి అంగీకరించడమే కదోయ్!"

"నీ బొంద! అర్ధాంగీకారం అంటే సగం అంగీకారం అని అర్థం!"

"పోనీ అదే అనుకున్నా, ఆమె సగం అంగీకరిస్తే చాలు కదోయ్. మిగతా సగం నేను అంగీకరిస్తాను. అప్పుడు పూర్ణాంగీకారమే కదా!"

"సరే ... పక్కింటి కోతిగాని, మన క్లాసులో అమ్మాయిలుగాని ఎప్పుడైనా నిన్ను ప్రేమించామని చెప్పారా?"

"లేదు."

"అయితే నీ ఆర్గ్యుమెంటు ప్రకారం వాళ్లందరిదీ మూకుమ్మడి మూగప్రేమ. వాళ్ల మౌనం కూడా అర్ధాంగీకారమే. యూ ఫూల్!" అన్నాడు సారథి.

అనుంగు మిత్రుని ప్రేమపట్ల ఆవంతైనా సింపతీ లేని మిత్ర ద్రోహి!

**జూన్ 20 :**

అప్రదిష్ఠ వాటిల్లని విధముగా నా డైరీ పేజీలను ఎడిట్ చేసి ఏదైనా అద్వితీయ వారపత్రికకు గానీ, అశేష ప్రజాదరణగల మాసపత్రికకు గాని పంపవలెనని దృఢసంకల్పించితిని.

"సంపాదక మహాశయులకు నమస్సుమాంజలి.

ఆర్యా,

ఈ రచనను సాధ్యమైనంత సర్వాంగసుందరముగా తీర్చిదిద్దుటకు చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా, మరియు శాయశక్తులా కృషి సల్పితిని. ఇందులో అనేక తప్పులు దొర్లి ఉంటే క్షంతవ్యుడను. అన్యథా భావించవలదు. తప్పులను ఒప్పులుగా భావించి, మంచిని స్వీకరించి, చెడును విస్మరించి, ప్రచురించి తమ అమూల్య ఉత్సాహ ప్రోత్సాహాల నందించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,

**రాంబాబు**

ది సీనియర్‌మోస్ట్ పార్ట్‌టైమ్ అప్రెంటిస్ సబెడిటర్
'సుజనమిత్ర'
ది లార్జెస్ట్ సర్క్యులేటెడ్ ప్రోగ్రెసివ్ తెలుగు డైలీ
పబ్లిష్డ్ ఫ్రమ్ చింతలబస్తీ, హై.బా."

■